www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 12 పేజీలు

వైఎస్ఆర్

అన్నమయ్య

ప్రయివేటుకు పులివెందుల
వైద్య కళాశాల

- జమ్మలమడుగులో గాలి, సౌర విద్యుత్ పెంపు
- దీపం-2 లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని కూటమి సర్కారు జిల్లాలోని పులివెదుల మెడికల్ కళాశాలను ప్రయివేటుకు అప్పగించింది. గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ భేటీలో మంత్రి వర్గ సమావేశం ఆమోదించింది. రాష్ట్రంలోని పలు మెడికల్ కళాశాలలోపాటు పులివెందుల మెడికల్ కళాశాల పిపిపి మోడ్‌లో సేవలందించనున్నట్లు తెలుస్తోంది. ఏపి ఇంటెగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా చింత గ్రీన్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా కొండాపురం మండలంలో కొప్పోలు పంప్డ్‌స్టోరేజీ 2లో

నామినేటెడ్
జాతర

ఉమ్మడి జిల్లాలో నలుగురికి చోటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి సర్కారు మరోసారి నామినేటెడ్ పదవుల పందేరం చేపట్టింది. గురువారం ఉమ్మడి కడప జిల్లాకు చెందిన నలుగురు టిడిపి నాయకులకు చోటు లభించింది. రాజంపేట నియోజకవర్గానికి చెందిన గన్నే సుబ్బనరసింహనాయుడు, బద్వేల్ నియోజకవర్గానికి చెందిన బజెపి నాయకులు నరిశెట్టి సుప్రజ, ప్రొద్దుటూరుకు చెందిన వద్ది సురేఖ, పులివెందులకు చెందిన జి.అమర్నాథ్‌యాదవ్‌లకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులు దక్కించుకున్నారు. నామినేటెడ్ పదవులు దక్కించుకున్న పలువురు అభ్యర్థుల అనుచరులు, టిడిపి కేడర్ సంబరాలు చేసుకోవడం గమనార్హం.

పిఎఫ్ రుణాల మంజూరులో నిర్లక్ష్యం వద్దు : యుటిఎఫ్ 2లో

విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు : డిఎంహెచ్‌ఓ 2లో

ప్రయివేట్‌కు పులివెందుల..

(మొదటిపేజీ తరువాయి) పవర్ ప్రాజెక్టును 360 మెగావాట్ల నుంచి 2,400 మెగావాట్లకు పెంచనుంది. గండికోటను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించుకోనుంది. వన్‌టైమ్ ఫిల్లింగ్, ఎవరా పరేషన్ నష్టాలకు 38 ఎంసిఎం కేటాయింపులు ఆమోదం తెలిపింది. జమ్మలమడుగు, ముద్దనూరు మండలాల్లోని పలు గ్రామాల్లో 100 మెగావాట్ల విండ్ పవర్ కెపాసిటీ, మైలవరం మండలంలో 60 మెగావాట్ల 84ఎం.డబ్ల్యూపీ.డిసి సోలార్ కెపాసిటీతో 100 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు అభివృద్ధి, రిన్యూ వబుల్ ఎనర్జీ పవర్ కెపాసిటీ, విండ్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టీడీలకు కేటాయించిన ప్రాంతాల్లో ఓవర్‌లాపింగ్ చేయడానికి అంగీకరిం చిం ది. దీపం-2 పథకం కింద జిల్లాలో ఐదు కిలోల గ్యాస్ లబ్ధిదారులు రూ.14.2 కిలోల గ్యాస్ సిలిండర్ దారులుగా మారును న్నారు.

నేడు యర్రబల్లి-చెరువుకు నీరు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఎన్నికల ప్రచారంలో భాగంగా పులివెందుల లోని యర్రబల్లి చెరువుకు నీరు అందిస్తామన్న హామీ శుక్రవారం నెరవేరనుందని, కదిరి దగ్గరనున్న హంద్రీ-నీవా నుంచి యర్రబల్లి చెరువుకు నీరు విడుదల చేస్తున్నామని, వీలుంటే వైసిపి నాయకులు జలహారతి పట్టాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీని వాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే రైతుల సంక్షేమం సాగుతోందన్నారు. వైసిపి హయాంలో మామిడికి గిట్టుబాటు ధర ఇవ్వలేదన్నారు. చంద్రబాబు నేతత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే మామిడికి గిట్టుబాటు కల్పించి కొనుగోలు చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని, యూరియా కొరత ఉందని పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హెరిటేజ్ సంస్థలో కిలో ఉల్లి రూ.30 లకు అమ్ముతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హెరిటేజ్ సంస్థ చంద్రబాబుది కాదన్న విష యాన్ని ఆయన మరచినట్లు ఉన్నారన్నారు. హెరిటేజ్ సంస్థకు చంద్రబాబుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. సిమెంటు పరిశ్రమలు బస్తాను రూ.300లకు విక్రయిస్తుంటే ఒక్క భారతి సిమెంటు మాత్రం రూ.350కు విక్రయిస్తున్నారని విమర్శి ంచారు.

కేన్సర్ ప్రాణాంతకం కాదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేన్సర్ త్వరగా గుర్తించి చికిత్స చేస్తే అది ప్రాణాంతకం కాదుని డాక్టర్ జి. వంశీ విహారి అన్నారు. బీమా వారోత్సవాల్లో భాగంగా ఎల్ఐసి కార్యాలయంలో నిర్వహించిన 'హెల్త్ టాక్, హెల్త్ క్యాంపు' సందర్భంగా ఆయన కేన్సర్‌కు సంబంధించిన అపోహలను, కారణాలను, నివారణను వివరించారు. కేన్సర్ ఊహించని విధంగా వస్తుందని అన్నారు. చికిత్సకు అమెరికాలో ఉన్న వైద్య సౌకర్యాలు కడప వంటి నగరాల్లో కూడా ఉన్నాయని అన్నారు. సరైన ఆరోగ్యానికి నడక, అన్ని రకాల కూరగాయలు, పండ్లు తినడం చాలా ముఖ్యమని తెలిపారు. డా.ఎన్.సాయి చరిత మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారించడానికి హెచ్ పి వి వ్యాక్సిన్ చాలా ముఖ్యమని చెప్పారు. మెడికల్ క్యాంప్ లో భాగంగా సిబ్బందికి బిపి, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు డాక్టర్లను ఎల్ఐసి యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్, సత్య శ్రీనివాస్, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

పిఎఫ్ రుణాల మంజూరులో నిర్లక్ష్యం వద్దు

సిబ్బందిపై చర్యలకు డిఆర్‌ఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రావిడెంట్ ఫండ్ రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం కనపరచడమే కాకుండా, ఉపాధ్యాయులను వేధిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజ యకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడును కలిసి ప్రావిడెంట్ ఫండ్ రుణాల మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివ జ్యోతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ జీతభత్యాల నుంచి దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ తమ అవసరాల కోసం, రుణాల కొరకు దరఖాస్తు చేసుకుంటే జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది కొందరు సకాలంలో రుణాలను మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతోపాటు, ఉపాధ్యాయులను వేధిస్తున్నారన్నారు. బద్వేలు మండలం, రాజుపాలెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల సహాయకులుగా పనిచేస్తున్న ఉపాధ్యా యుడు ప్రావిడెంట్ ఫండ్ రుణం కోసం జులై 22న దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. దరఖాస్తు చేసి 45 రోజులు దాటినప్పటికీ, ఇప్పటివరకు రుణాన్ని మంజూరు చేయలేదని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రావిడెంట్ ఫండ్ క్లర్క్ శివజ్యోతి ఉపాధ్యాయునికి ఆగస్టు 18న ఫోన్ చేసి, తాను సకాలంలో రుణాన్ని మంజూరు చేయించడానికి ప్రతిపాదనలు తయారు చేసినప్పటికీ పరిపాలనా ధికారిగా వ్యవహరిస్తున్న భాస్కర్ రెడ్డి మంజూరు చేయకుండా రిమార్క్ రాశారని పేర్కొంటూ, స్టాంపు అంటించిన అనెగ్జర్ పేపర్‌ను మరోసారి సంతకాలు చేసి పంపాల్సిందిగా కోరారన్నారు. ఆ మేరకు 19న మరోసారి సంబంధిత పేపర్‌ను సమర్పి ంచినప్పటికీ రుణాన్ని మంజూరు చేయలేదని పేర్కొన్నారు. తిరిగి క్లర్కు శివజ్యోతి సెప్టె ంబర్ 1న ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి మీరు రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బద్వేల్ మండలం అని ఎలా దరఖాస్తు పెడతారని, రాజుపాలెం బద్వేల్‌లో ఎలా వస్తుందని అడిగారన్నారు. ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధిస్తూ రుణాలు మంజూరు చేయకుండా కాల యాపన చేస్తున్నారన్నారు. కార్యాలయ ప్రొవిడెంట్ ఫండ్ సెక్షన్ పరిపాలనాధికారి భాస్కర్ రెడ్డి సైతం ఇదేవిధంగా వ్యవహరిస్తూ బద్వేల్లో రాజుపాలెం ఎలా వస్తుందని ప్రశ్ని ంచారన్నారు. ఈ విషయంపై జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి తక్షణమే స్పందించి, ఉపాధ్యాయులను వేధిస్తున్న శివ జ్యోతితో పాటు, పరిపాలనాధికారి భాస్కర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్య వర్గ సభ్యులు గాజులపల్లె గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, డి.సుబ్బారావు, ఎ.వీరనారాయణ పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు

ప్రజాశక్తి-కాశినాయన

నరసాపురం ఆరోగ్య కేంద్రంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డిఎంఅండ్‌హెచ్‌ఒ నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన నర్సాపురంలోని బారాగజ్జి మహబూబ్‌పీరా అనే బాలుడు అనారోగ్యంతో తెల్లవారుజామున 5 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే అక్కడ సిబ్బంది ఎవరు లేరని తెలిసిం దన్నారు. ఆమెను వెంటనే నరసాపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని, పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లారని చెప్పారు. అప్పటికే మహబూబ్‌పీరా మృతిచెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యహరించిన నరసాపురం ఆరోగ్య సిబ్బందిపైనా చర్యలు తీసుకు ంటామని డిఎంహెచ్‌ఒ పేర్కొన్నారు. అలాగే 108 సిబ్బంది నిర్లక్ష్యంపైనా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ డిఎం హెచ్‌ఒ మల్లేష్, వైద్యాధికారులు ప్రశాంతి పుష్ప ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- జిల్లా పరిషత్ సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని జిల్లా పరిషత్ సిఇఒ ఓబులమ్మ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా పలు పంచాయతీల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం అభివద్ధి పనులపై ఎంపిడిఒ కుళాయి బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు, పలు రికార్డులను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించి ఇక్కడికి పలు సమస్యల పైన వచ్చే ప్రజలతో వినయ పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారమయ్యే విధంగా చూడాలని, పరిష్కారం కాని వాటి గురించి వారికి ఎందువల్ల పరిష్కారం అవదో వారికి వివరించి తెలియజేయాలని సూచించారు. ఆమె వెంట కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిల్పారామం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శిల్పారామం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆమె కడప శిల్పారామాన్ని సందర్శించారు. కల్యాణ మండపం డార్మెంటరీ, బోటింగ్, టికెట్స్ కౌంటర్లను, గేమ్స్‌ను పరిశీలించారు. అనంతరం శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్, శిల్పారామం అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటసుబ్బయ్యను శిల్పరామం పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిల్పారామానికి కల్యాణ్ మండపం నుంచి డార్మెంటరీ వరకు పెన్సింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. బొమ్మలుకు, పెయింటింగ్‌కు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కడపలో వాటర్ ఫాల్స్ పెట్టడానికి ఆసక్తి గల వారికి అనుమతులు ఇస్తామని, చేతివృత్తుల వారికి స్టాల్స్ తక్కువ బాడుగకు ఇస్తామని పేర్కొన్నారు. అన్ని శిల్పారామం కన్నా కడప శిల్పారామం ఫుట్ పాల్స్ ఎక్కువగా ఉందని, కడప నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న శిల్పారామం అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. పిపిపి పద్ధతులలో ఆసక్తి గల వారికి ఫుడ్‌నెస్ సెంట్రల్ ఏర్పాటు చేయడానికి, కొత్త గేమ్లు ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

శిల్పారామాన్ని సందర్శిస్తున్న చైర్‌పర్సన్

మాట్లాడుతున్న ఎంపిడిఒ భానుప్రసాద్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- కలకడ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపిడిఒ భానుప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలతో వెలుగు సమావేశ కార్యాలయం లో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం బాలికల విద్య పై దృష్టి పెట్టాలన్నారు. మండలంలో అంగన్వాడీ కేంద్రాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు బి.శాంత, పి.యశోదరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ , బాలికల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ లావణ్య, ఎఎన్ఎం రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహా నివేదన, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, సంభావన, పవిత్ర వితరణ తదితర వైదిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్లు, దిలీప్ ఆలయ అర్చకులు సాయి కృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఇన్ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో అల్యూమిని మీట్ చేశారు. సాంకేతిక శిక్షణ పూర్తి చేయడం ద్వారా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.ఐటిఐలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, సర్పంచ్ మౌలా ఛైర్మన్బాషాను సన్మానించారు.

రూ.1.15 లక్షలు పలికిన లడ్డూ

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నీలిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.1.15లక్షలు ధర పలికింది. అదే గ్రామానికి చెందిన దాసరి గంగులయ్య కుమారుడు ప్రసాద్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ప్రసాద్ను మేళతాళాల నడుమ ఊరేగింపు గా ఇంటికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉప్పుశెట్టి సుధీర్, రెడ్డయ్య, చంద్రమోహన్,పవన్, ప్రసాద్, ఎఎస్ఐ సుబ్బయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేలంలో లడ్డూను దక్కించుకున్న ప్రసాద్

ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కలకడలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

పుల్లంపేటలో ఉపాధ్యాయదినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని జడ్పి ఉన్నత పాఠశాల, టి.చదివేవాండ్లపల్లిలో ముందస్తు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. శుక్రవారం రోజున ఈద్-ఎ-మిలాద్ పండుగ కారణంగా పాఠశాలకు సెలవు ఉండటంతో వేడుకలను ముందుగానే నిర్వహించారు. ఉపాధ్యాయుల మధ్య క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక ఆటలు నిర్వహించగా, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సి.రమేష్రెడ్డి ఉపాధ్యాయులు హసీనా జానం సుజాత, సబిత, కరుణ, అశోక్ నాయక్, సురేఖ, వీడీ రెడ్డి మోహన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ గోవింద తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి,విద్యార్థులు ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించారు. ఉపాధ్యాయులను పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్నాయుడు ప్రిన్సిపల్ గోవింద శాలువాకప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్, శ్రీ శాంతినికేతన్ హై స్కూల్, దలవాయిపల్లి ఆదర్శ పాఠశాల ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణ యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదటి రాష్ట్రపతిగా దేశానికి సేవ చేశారని అన్నారు. ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేసిందన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1962వ సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పి హైస్కూల్లో గురువారం నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు డిప్యూటీ డిఇఒ నాగయ్య, ఎంఇఒ-2 అనంతకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, శిల్పి ఆనందాచారి, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, గొంటుముక్కల వెంకటరమణ, జివి.ప్రసాదరావు, గౌరీ, గీత, జ్యోతి ప్రియ, విజయ కుమారి, మస్తాన్, డాక్టర్ శర్వాణి, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య, నాగలక్ష్మిలను తాంబూలం, పూలు, పండ్లు, పట్టు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి హుమతులను అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆరుగురు ఎంపిక

కలికిరి : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఇఒ కరీముల్లా పేర్కొన్నారు. మండలంలో కనిగిరి మెయిన్ స్కూల్లో పిఎస్ హెచ్ఎం విధులు నిర్వర్తిస్తున్న మురార్ పావలి, మేడుకుర్తి జడ్పిహైస్కూల్లో పనిచేస్తున్న సుబ్బారెడ్డి, జడ్పి ఉర్దూ మహల్లో పనిచేస్తున్న ఇజాజ్అహ్మద్, ప్రాథమిక పాఠశాల చింతమాకులపల్లిలో పనిచేస్తున్న భారతి, కొమ్మరవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సరిత, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సుగుణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులు మీదుగా ప్రశంస పత్రాలు అందుకోనున్నట్లు ఎంఇఒతెలిపారు.

రఘురామయ్యకు రాష్ట్ర ఉత్తమ ఆధ్యాపక అవార్డు

రఘురామయ్య

వీరబల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరబల్లిలో తెలుగు అధ్యాపకులు గూబల రఘు రామయ్య, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈయన 2022లో అన్నమయ్య జిల్లా ఉత్తమ ప్రిన్సిపల్గా ఆకేపాడు ఫౌండేషన్ తరఫున అవార్డు, 2024లో ఉత్తమ ప్రిన్సిపల్గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని చెప్పారు. 2024లో యోగి వేమన యూనివర్సిటీ తరఫున ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్గా ఎన్నికయ్యారని చెప్పారు.

ప్రగతికి మార్గం గురువు

వెంకటసిద్దయ్య

సుండుపల్లి : అజ్ఞానం అనే అంధకార చీకటిని తొలగించి సుజ్ఞానమనే వెలుగును ప్రసాదించే కాంతి కిరణం గురువు అని, బాలిరెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.వెంకట సిద్ధయ్య పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. సమాజానికి వెన్నుముక లాంటి వాడు గురువని, విద్యార్థులకు నిచ్చెన లాంటి వాడని అన్నారు. దేశభవిష్యత్తుకే దిశా, నిర్దేశం చేసే 'దిక్సూచి గురువని పేర్కొన్నారు. అక్షర భాండాగారం ఉపాధ్యాయుడని, విద్యార్థులకు గురువులు చెప్పే పాఠాలను శ్రద్ధగావిని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

బి.కొత్తకోటలో వీధికుక్కల స్వైరవిహారం

కుక్కకాటును చూపుతున్న మహిళ

ఒకేరోజు 25 మందిని కాటేసిన కుక్కలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో కుక్కకాటు బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే 25 మందికిపైగా కుక్కకాటుకు గురై ఆసుపత్రి పాలయ్యారు. పట్టణ ప్రజల భద్రతను మున్సిపల్ అధికారులు గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై గత కొన్ని రోజులుగా నగర పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా, వార్తాపత్రికల్లో కథనాలు వెలువడినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో అనేక మంది కుక్కకాటుకు గురైన ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్న పట్టణ ప్రజలు ఇకమీదట ఎవరైనా కుక్కకాటుకు గురైతే పూర్తి బాధ్యత మున్సిపల్ అధికారులదేనని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు వీధికుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.


చెన్నకృష్ణను దుశ్శాలువాతో సన్మానిస్తున్న జనసైనికులు

చెన్నకృష్ణను సన్మానించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లి

ఇటీవల మండల కురబసంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గంతల చెన్న కృష్ణను రాజంపేట పార్లమెంటుకు చెందిన జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ అనునిత్యం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బిసిలు రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదగాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడపజిల్లా జనసేన మాజీ సోషల్ జస్టిస్ సభ్యులు షేక్స లీమ్, నవీద్, కిరణ్, రామంజులు, సిధార్థ, సాజిద్ పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన రెడ్డిశేఖర్

ప్రజాశక్తి-సుండుపల్లి

సిఎం చంద్రబాబుతో రెడ్డిశేఖర్

తిరుపతి ఎయిర్పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్ది, కువైట్ సహా గల్ఫ్ దేశాల నుంచి నేరుగా విమానాల రాకపోకలు సాగేలా కృషి చేయాలని సిఎం చంద్రబాబును కోరినట్లు ఎన్ఆర్ఐ టిడిపి నాయకుడు కంచర్ల రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. గురువారం సిఎం చంద్రబాబును కలిసినట్లు తెలిపారు.మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించినట్లు చెప్పారు. రాయవోటి, రాయవరం, పింఛాలో అసంపూర్తిగా నిలిచి పోయిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. మండలంలోని 14 పంచాయతీల్లో రాళ్లమడుగు నుంచి తాగునీరు, సాగునీరు అందిస్తామని గతంలో పనులు చేసి నిలిపివేశారన్నారు. దశాబ్దాల క్రితం నాటి నుంచి కలగానే మిగిలి ఉన్న ఝరికోన ప్రాజెక్టు నుంచి సాగునీటి కోసం కాలువలు ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. సిఎం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిని తరిమేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎయిడ్స్ వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిటి కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఆర్ఎస్ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఫీల్డ్ కౌన్సిలర్ ఎన్.జనార్దన్, ఎఎన్ఎం శ్వేత, వారి సిబ్బంది కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి మానవులపట్ల మహమ్మారి లాంటి దన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్యకర్తలు ఇచ్చే సందేశాన్ని శ్రద్ధగా విని అవగాహన పెంచుకొని ఎయిడ్స్ వ్యాధి భారిన పడకుండా విద్యార్థులు తమను తాము రక్షించుకోవడంతో పాటు సమాజాన్ని రక్షించాలన్నారు. హెచ్ఐవి, క్షయవ్యాధి వచ్చే మార్గాలను, నివారణ చర్యలను ఎఎన్ఎం శ్వేత వివరించారు. ఫీల్డ్ కౌన్సిలర్ జనార్దన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, వాటి కబంధహస్తాల నుండి ఎలా బయటపడాలో విద్యార్థులకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగె రాఘవరెడ్డి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి. శైలజ, డాక్టర్ డి. శ్రీనివాసులు, డాక్టర్ జి.చిన్నారెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనార్దన్

క్రైం కార్నర్

రోడ్డు పక్కన నిల్చున్న వారిపై దూసుకెళ్లిన కారు

ఒకరు మృతి - ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. స్థానిక కొత్తఇండ్లుకు చెందిన బొమ్మనచెరువు గోపాల్, నిమ్మనపల్లె మండలం, మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు శంకర రాత్రి బసినికొండ బైపాస్ రోడ్డులోని నాలుగురోడ్ల కూడలి వద్ద నిలబడి మాట్లాడు కుంటున్నారు. ఈ సమయంలో స్థానిక టమాట మార్కెట్ మాజీ చైర్మన్ భర్త తట్టి శ్రీనివాసులురెడ్డి కారు వేగంగా వచ్చి రైతు శంకర, గోపాల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం శంకర పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు శంకర మృతి చెందాడు. గోపాల్ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ కథనం మేరకు.. మండలంలోని తట్టివారిపల్లికి చెందిన జె.జయపాల్ భార్య దేవిక (62) తన ఇంటికి సమీపంలోని నాలుగు రోడ్ల వై జంక్షన్ వద్ద దుకాణానికి వెళ్లింది. రోడ్డు దాటుకునే క్రమంలో ఓ కార్నర్‌లో నిలబడుకుని ఉండగా అటుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవిక తీవ్రంగా గాయపడడంతో గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తి దుర్మరణం

కలకడ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సంబేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..సంబేపల్లి మండలం ఎస్ సోమవారం పంచాయతీ అగ్రహారంనకు చెందిన సత్తార్ సాహెబ్ కుమారుడు రంగీన్ సాహెబ్(64) తన ద్విచక్ర వాహనంలో భార్య నసీబ్ జాన్‌తో కలిసి పీలేరు సమీపంలో ఉన్న తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారులు గల బండకింద పల్లెకు తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా తన ద్విచక్ర వాహనం కారును ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి తీవ్ర రక్త గాయాలై రెండు కాళ్లు విరిగినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇరువురిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స అందించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రంగీన్ సాహెబ్ మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం భార్య నసీబ్ జాన్‌ను తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. మృతి చెందిన రంగీన్ సాహెబ్ మృతదేహానికి పీలేరు ప్రభుత్వ వైద్యశా లలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగిం చిన ట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. కాగా మృతుడు బేల్దారి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడాల్సి వచ్చిందని ప్రజలు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మదనపల్లెలో వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కొత్తపల్లి పంచాయతీ, రంగారెడ్డి కాలనీ కొత్త ఇండ్లుకు చెందిన అప్షద్‌బాషా కుమారుడు మహమ్మద్ జైన్(22) మటన్ మార్కెట్‌లో పనిచేసుకుంటూ జీవనం చేసేవాడు. గత ఆరు నెలల క్రితం కామెర్ల పడడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తిరుపతి, బెంగళూరు లాంటి పెద్ద నగరాల్లో చికిత్స చేయించుకున్నా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రాత్రి తన గదిలో పడుకొని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా పంపిణీలో అవకతవకలు ఉండకూడదు

-రాజంపేట సబ్‌కలెక్టర్ భావన

యూరియా పంపిణీని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ భావన

ప్రజాశక్తి-నందలూరు

రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్.భావన మండలం లోని నందలూరు రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ రైతు సేవ కేంద్రాలలో యూరియా పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు ప్రతి రైతు దగ్గర ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకాన్ని పరిశీలించి ప్రతి రైతుకు ఒక బ్యాగ్ చొప్పున యూరియాను పంపిణీ చేస్తున్నట్లు సబ్ కలెక్టర్‌కు మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున వివరించారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రతి రైతుకు యూరియాను అందించాలని ఆదేశించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అరవ పల్లిలో ఉన్న చౌక దుకాణాన్ని సబ్ కలెక్టర్‌ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రికార్డులను పరి శీలించారు. రేషన్ పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్, తహశీల్దార్ అమరేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా స్వామిత్వ సర్వే : డిఎల్‌పిఒ

సర్వేను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ, ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో కొనసాగుతున్న స్వామిత్వ సర్వేను అధికారులు వేగంగా పూర్తి చేయాలని మదనపల్లె డివిజనల్ లెవెల్ పంచాయతీ ఆఫీసర్ నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండలంలో ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాల రాజుతో కలిసి ఆయన పర్యటించారు. మండలంలోని బండ్లపై, రాచవేటివారిపల్లె, ముష్టూరు, కొండయ్యగారిపల్లె పంచా యతీ లలో జరుగుతున్న స్వామిత్వ సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో మెరుగైన, సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమని చెప్పారు. సామాజిక, ఆర్థిక సాధికారతను, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి ప్రధానినరేంద్ర మోడీ 2020 ఏప్రిల్ 24న పథకాన్ని ప్రారంభించి ఆస్తి సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. 2021 నుంచి 2025 వరకు దేశ వ్యాప్తంగా 6.62 లక్షల గ్రామాలను ఈ పథకం ద్వారా సర్వే చేయ నున్నారని తెలిపారు. అధికారుల నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకో వడానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు సర్వే కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచి వాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సరఫరా కేసులో..

ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వివరాలు వెల్లడిస్తున్న సిఐ

అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా, సరఫరా, మామూళ్ల వసూ ళ్లకు పాల్పడిన ములకలచెరువు ఎక్సైజ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌ను బి.కొత్తకోట సిఐ కె.గోపాల్‌రెడ్డి బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తంబళ్లపల్లెకు చెందిన ఎ.కిరణ్‌కుమార్ మదనపల్లె డివిజన్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన విధులను అడ్డుగా పెట్టుకుని కర్ణాటకలోని రాక్ వ్యాలీ నుంచి మద్యాన్ని ఇక్కడికి తరలించేవాడని చెప్పారు. పనిచేసే చోటనుంచి ఎవరికి అనుమానం రాకుండా మండలంలోని తుమ్మనంగుట్ట గ్రామానికి చెందిన బంధువు రమేష్‌తో మద్యాన్ని తరలించి అమ్మకందార్లకు సరఫరా చేసేవాడన్నారు. ఈ వ్యవహారం చాలా కాలంగా గుట్టుగా ఆసగిస్తున్నాడని చెప్పారు. 2023లో ఎస్‌హెచ్‌ఒగా ట్రైనీ డిఎస్‌పి ప్రశాంత్ పనిచేస్తున్న సమయంలో గోళ్లపల్లె గ్రామం చీకుచెట్టుపల్లెలో కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో దాడులు నిర్వహించగా అస్సాంకు చెందిన జుల్తార్‌అలీ, గణపతి, పి.రమేష్ అనే వ్యక్తులు పట్టుబడ్డారని అన్నారు. వీరిని అరెస్ట్ చేసి విచారించినట్లు తెలిపారు. ఈ విచారణలో రమేష్ తమకు కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నాడని మిగతా ఇద్దరూ వెల్లడించినట్లు పేర్కొన్నారు. రమేష్‌ను విచారించిన ట్రైనీ డిఎస్‌పి ప్రశాంత్ వివరాలను సేకరించారని తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నాడని, తాను అమ్మకందార్లకు విక్రయిస్తానని, కర్ణాటక మద్యం విక్రయి స్తున్నందుకు మామూళ్లు వసూలు చేస్తున్నట్టు విచారణలో వెల్లడైందని తెలిపారు. విక్రయ దార్ల నుంచి ఫోన్ ద్వారా సొమ్ము తీసుకుని ఆ సొమ్మును కిరణ్‌కుమార్‌కు ఫోన్‌పే ద్వారా జమ చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాల ఆధారంగా ముగ్గురు నిందితులను అప్పట్లోనే అరెస్టు చేసినట్లు తెలిపారు. కిరణకుమార్ విషయంలో ఎస్‌పి సమగ్ర దర్యాప్తుకు ఆదేశించడంతో విచారణ చేపట్టి సమగ్రంగా ఆధారాలు సేకరించి కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రోడ్డు ప్రమాదంలో టిడిపి నాయకుడు మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో నెలకొంది.. వివరాల్లోకి వెళితే..మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువ మాచిరెడ్డిగారి పల్లెకు చెందిన టిడిపి బూత్ ఇన్‌ఛార్జి గోపన్న గారి శంకర మదనపల్లి –నిమ్మనపల్లి రోడ్డులోని బైపాస్ రోడ్డు సర్కిల్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని తిరుపతికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణిం చారని అన్నారు. మృతుని కుటుంబంలోనూ, గ్రామంలోనూ విషాద ఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మృతదేహానికి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడుతూ గోపన్న గారి శంకర టిడిపి పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ పార్టీలో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ఆయన క్రమశిక్షణ కలిగిన నాయకుడని, ప్రస్తుతం బూతు ఇన్‌ఛార్జి టిడిపి పార్టీలో బాధ్యతలు నెరవర్తిస్తున్నారన్నారు. సర్పంచ్ సుబ్రమణ్యం, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, బూత్ ఇంచార్జ్ శివకృష్ణ, వేణుగోపాల్, మునీంద్ర, ఉదయ్ కుమార్, గోపాల్ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- తమిళ కూలీలు పరారీ

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కొత్తిమడుగు బీటులో గురువారం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎర్రచందనందుంగలు మోసుకొని వస్తున్న తమిళ కూలీలు అటవీశాఖ సిబ్బందిని గమనించి దుంగలు విడిచిపెట్టి పరారయ్యారని ఐసి,ఎఫ్ఎస్ఒ జి.భరణి కుమార్ తెలిపారు. దుంగలను లెక్కించగా 13 ఎర్రచందనం దుంగలు ఉన్నాయని వాటి బరువు సుమారు 370 కేజీలు ఉన్నాయని, వాటి విలువ రూ.1.80లక్షలు ఉంటుందని తెలిపారు. పరారీలో ఉన్న తమిళ కూలీల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కూంబింగ్‌లో వంగిమళ్ల సెక్షన్, ఆర్ రెడ్డప్ప, కొత్తిమడుగు బీట్, ప్రొటెక్షన్ వాచర్స్ రమణ, గురయ్య, రెడ్డయ్య, శ్రీనివాసులు కొండయ్య, జయరామ, పెద్ద రెడ్డయ్య, శీను, సుబ్బరాయుడు, పాల్గొన్నట్లు తెలిపారు

జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ఈనెల 8నుంచి మూడు రోజుల పాటు కడప హరిత హోటల్‌లో జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు గుర్రం డేవిడ్ రాజ్ తెలిపారు. రాజుపాలెం తహశీల్దార్ కార్యాయలం వద్ద గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుర్రం డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయు) జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, రాజస్థాన్, తమిళనాడు తదితర 22 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటా రన్నారు. కరపత్రాల విడుదలలో ఓబయ్య, పవన్, షరీఫ్, ఖలీల్ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజానికి పునాదిరాళ్లు ఉపాధ్యాయులే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉత్తమ సమాజానికి ఉపాధ్యాయులు పునాదిరాళ్లు వంటివారని పెద్దముడియం మండల విద్యాశాఖ అధికారులు శివజ్యోతి, చౌడయ్య పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వేడుకలు పెద్దముడియం మండలం గుండ్లకుంట మండల వనరుల కేంద్రంలో అధికారులు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించరు. ఉపాధ్యాయుల అవిశ్రాంత కృషి వల్లే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రూపొందుతారని తెలిపారు. అనంతరం మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయలుగా ఎంపికైన ఎం.శారదాదేవి, సి.పద్మావతమ్మ, కె.రామ సుబ్బమ్మ, తప్పెట విక్టర్ పాల్, బి.నంద ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది లక్ష్మణ్, నరేంద్ర, ఉపాధ్యాయ నాయకులు శివరా మిరెడ్డి, నాగార్జునలరెడ్డి, సిఆర్పీలు నాగేంద్ర పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన బిర్రు గుర్రప్ప

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు బిర్రు గుర్రప్ప అలియాస్ సంతోష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి లోకేష్ ఎస్సీ సామాజిక ప్రకారంగా ఏమైనా సమస్యలు ఉన్నాయని ఆరా తీశారు. ఆ మేరకు బిర్రు సంతోష్ సామాజికంగా ఎస్సి సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించి ఆదుకోవాలని సూచించారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతను పెంచడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. దీనిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్యాలయాలలో ప్రజల ఫిర్యాదుల సత్వర, నాణ్యమైన పరిష్కారంపై దష్టి సారించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత గడువలోగా పరిష్కరించడం, సమస్య మూల కారణాన్ని గుర్తించి, సమగ్ర పరిష్కారం అందించడం, సమస్యను పరిష్కరించిన తరువాత ఫిర్యాదుదారుడి సంతప్తిని నిర్ధారించుకోవడం, ప్రజా ప్రాధాన్యత ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యత లోపాలు ఉండకూదన్నారు. ఆదేశాలను ఉద్యో గులు, అధికారులు తప్పక పాటించాలని, నాణ్య తలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, టీజీ ఆర్ఎస్ డిస్ట్రిక్ట్ కంట్రోల్‌రూమ్ కో–ఆర్డినేటర్ మంజూష, జిల్లాలోని ఎఇలు, జెఇలు పాల్గొన్నారు.

యుటిలిటీ పైపుల ఎత్తు పెంపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కింద వేసిన యుటిలిటీ పైపుల ద్వారా కొంతమంది అక్రమంగా వ్యవసాయ నీటి కోసం వాడుతూ తమ పొలాలకు మాత్రమే నీరు మళ్లించే ప్రయత్నం చేయడంతో సంబంధిత అధికారులు గురువారం ఎత్తు పెంచారు. గ్రామ ప్రజల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన జాతీయ రహదారి సంస్థ అధికారులు యుటిలిటీ పైపులను ఎత్తు పెంచారు. ఈ పైపుల గుండా నీరు ప్రవహించే అవకాశం లేకుండా చర్యలు చేపట్టారు. యుటిలిటీ పైపుల గుండా భవిష్యత్‌లో వివిధ అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే అధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రైతులు పేర్కొన్నారు.

వశిష్ట కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

హైదరాబాద్ వశిష్ట కాలేజీ పేరుతో అక్రమ అడ్మిషన్స్ నిర్వహిస్తూ పిఆర్ఒల ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆ కాలేజీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు గురువారం డిమాండ్ చేశారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని డిఎడబ్ల్యూ కాలేజీ పక్కన అపార్ట్మెంట్లో వశిష్ట పేరుతో సాంబశివరావు అనే వ్యక్తి ప్రొద్దుటూరు ప్రాంత విద్యార్థులను వారి తల్లిదండ్రులను బెస్ట్ చదువులు, బెస్ట్ ఎడ్యుకేషన్ అంటూ మోసపూరితంగా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విజయవాడ, హైదరాబాదులోని వశిష్ట క్యాంపస్‌లో చేర్పిస్తున్నారని తెలిపారు. నీట్, జెఇఇ మెయిన్స్, ఎంసెట్ కరికులం పేరుతో ఎక్కడో హైదరాబాదులో ఉన్న క్యాంపస్‌లను చూపి ఇక్కడి విద్యార్థులను మోసం చేయడం దుర్మార్గమన్నారు. ప్రొద్దుటూరులో గుర్తింపులేని వశిష్ట అకాడమీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు కత్తి ఓబులేసు, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకుడు ములపాకు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం

ప్రజాశక్తి - లింగాల

లింగాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు లాభాసాటిగా ఉండేలా మెరుగైన సేవలు అందిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలోలేని విధంగా రైతులకు రాయితీ పద్ధతిలో వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు, పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఆన్‌లైన్ సేవలు పాడి రైతులకు రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సిఈఓ వినోద్‌కుమార్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నవీన్ కుమార్‌రెడ్డి

భూముల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతుల భూములను పరిరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ సభా భవనంలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో గ్రామాల్లోని రికార్డులకు సంబంధించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా స్వామిత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ చిన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల భూములను పరిరక్షించేందుకే రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఏ రైతు కూడా తమ భూములపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇందులో భాగంగా రైతుల భూములు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వామిత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. స్వామిత్వ అనేది గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమన్నారు. ఇది సామాజిక-ఆర్థిక సాధికారతను, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర రంగ పథకంగా 2020 ఏప్రిల్ 24న భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారన్నారు. ఆస్తి సర్వే కార్యక్రమం 2021 నుండి 2025 వరకు దేశవ్యాప్తంగా 6.62 లక్షల గ్రామాలను ఈ పథకంలో సర్వే చేయనున్నారు, ఆస్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నయ్య

డేటాను సేకరించేందుకు డ్రోన్‌లతో సహా వివిధ సాంకేతికతను ఉపయోగిస్తారన్నారు. ఆర్థిక లిక్విడిటీని పెంచుతూ కచ్చితమైన భూ రికార్డులను అందించడం ద్వారా ఆస్తి వివాదాలను తగ్గించడానికి ఈ పథకం ఉద్దేశించబడింద తెలిపారు. ప్రణాళిక, ఆదాయ సేకరణను క్రమబద్ధీకరించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తి హక్కుల గురించి నివాసితులకు తెలియజేయడం ఈ పథకం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పులివెందుల రెవెన్యూ పరిధిలోని పులివెందుల, వేముల, వేంపల్లి, చక్రాయిపేట, వీరపునాయినపల్లి, తొండూరు, సింహాద్రిపురం, లింగాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సిబ్బందిని సన్మానిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఇ రమణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వాట్సాప్ గ్రూపుల ద్వారా విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేయాలని ఆ శాఖ ఎస్ఇ రమణ ఆదేశించారు. పట్టణంలో విద్యుత్ కార్యాలయంలో వివిఎన్ పల్లి, ఎర్రగుంట్ల, కమలాపురం అధికారులు, సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ విద్యుత్ సంస్థపై ప్రజల సంతృప్తికర స్థాయి పెంచేలా సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించే దిశగా శ్రద్ధ వహించాలన్నారు. లో వోల్టేజ్ సమస్యలు ఉండకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసుల విడుదలలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా వారి సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. తమకు కేటాయించిన పరిధిలోని లైన్లలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి, ముందస్తు మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. బిల్లులు చెల్లించని పక్షంలో కనెక్షన్ కట్ చేయాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆయన సన్మానించారు. చిలంకూరులో 33/11 కె.వి సబ్‌స్టేషన్‌ను ఎస్ఇ రమణ పరిశీలించారు. సమావేశంలో డిఇ రమణారెడ్డి, ఎడి కిరణ్‌కుమార్, ఎఇలు ప్రియదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్, చాంద్‌బాషా, హరిప్రసాద్ రెడ్డి, జెఇలు, అకౌంట్స్ సెక్షన్, ఎల్ఐలు, ఎల్ఎంలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు, కమలాపురంలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - వేముల

చింతలజూటూరు గ్రామంలో గురువారం ఉల్లి పంటలను జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర బాబు, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజక వర్గంలో ప్రస్తుతం సాగు చేసిన ఉల్లి పంట 20శాతం మాత్రమే కోత దశకు వచ్చిందన్నారు. మిగిలిన 80శాతం ఈ నెలాఖరులోగానీ, అక్టోబర్ మొదటి వారంలోగానీ కోతదశకు వస్తాయన్నారు. ఉల్లి పంటలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను వివరిస్తూ.. పంట కోతకు 15 రోజుల ముందే నీటి తడులు ఇవ్వడం ఆపాలన్నారు. 2.5 సెం.మీ (అంగుళం) ఎడంతో ఆకుల నుండి గడ్డను కోయాలన్నారు. తద్వారా గడ్డ కుళ్లిపోయే అవకాశం తక్కువగా ఉంటుందని సూచించారు. ఉద్యాన శాఖ 50 శాతం రాయితీతో ఉల్లి నిల్వచేయు గోదాములను 24 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తుతో నిర్మించుకున్నట్లయితే

ఉల్లి పంటను పరిశీలిస్తున్న అధికారి రవిచంద్ర బాబు

రూ.87,500 రాయితీ అందుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉల్లి క్వింటాకు రూ.1200 మద్దతు ధరను ప్రకటించిందన్నారు. జిల్లాలోని మైదుకూరు, కమలాపురం మార్కెట్ యార్డుల్లో ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

పాఠశాల అభివృద్ధికి కృషి హర్షణీయం

వేంపల్లె :ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుడు వెంకటేష్ కృషి హర్షణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, పశు వర్ధక శాఖ ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అలిరెడ్డిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేష్‌కు గంగ రూరల్ ఎన్‌రోల్‌మెంట్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యా బోధన చేసేందుకు ఉపాధ్యాయుడు వెంకటేష్ కృషి అభినందనీయమన్నారు. ప్రయివేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులకు సలహాలిచ్చి పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఆయా రంగాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గంగ రూరల్ ఎన్‌రోల్‌మెంట్ వెల్ఫేర్ అధ్యక్షుడు శివ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకటేష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వారి సమస్యలను తెలిపారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు కిషోర్, కోడి రమణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వెంకటసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నరహరిపురంలో పలువురు వైసిపి కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన రాచుపల్లె వెంకటసుబ్బారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి ఆరోగ్య, క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో గ్రామానికి చెందిన పల్లా నరసింహారెడ్డి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిటిసి శివ, వైసిపి నాయకులు పాలెంపల్లె చిన్న వీరారెడ్డి, బాలసుబ్బారెడ్డి, వీరారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, నాగేష్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తకు పార్టీ గుర్తింపు

ప్రజాశక్తి - వేంపల్లె

పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తనూ పార్టీ గుర్తించి పదవులు కట్టబెడుతుందని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బోరెడ్డి జగన్నాథరెడ్డికి హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో బోరెడ్డి జగన్నాథరెడ్డిని రఘునాథ్‌రెడ్డి, టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, మైనార్టీ నేత మహమ్మద్ షబ్బీర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి స్థాపించిన నాటి నుండి పార్టీ కోసం ఆహర్నిశలు కష్టపడిన సీనియర్ నాయకుడు జగన్నాథరెడ్డికి హౌసింగ్ కార్పొరేషన్‌లో పదవి వరించడం సంతోషంగా ఉందన్నారు. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన నాయకుల, కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఎస్‌పి శివకృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేషారెడ్డి, పూల అల్లాబకష్, తక్కల షరీఫ్, సహకార సొసైటీ చైర్మన్ రామాంజనేయరెడ్డి, జబిబుల్లా, ఫయాజ్, గంగధర్ రెడ్డి, వేమకుమార్, గోగుల మల్లికార్జున, యాసిన్, యుగంధర్, భాస్కర్, ఎద్దుల కొండయ్య, సెట్ అహమ్మద్ ఆలీ, పివి రమణ పాల్గొన్నారు.

జగన్నాథరెడ్డిని సన్మానిస్తున్న రఘునాథ్‌రెడ్డి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.రాహుల్ పిలుపు నిచ్చారు. మైదుకూరు పట్టణంలోని మేధా డిగ్రీ కళాశాలలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాహుల్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యార్థుల సమస్యలను, ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చలో విజయవాడ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణలో ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** ఎస్‌ఎఫ్‌ఐ బ్రహ్మంగారిమఠం కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గర్ల్స్ హాస్టల్‌లో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్, మండల అధ్యక్షకార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రంలో చూపించాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివ శంకరయ్య సూచించారు. స్థానిక సాయికుటీర్ రోడ్‌లోని గౌతమ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు, క్షయ వ్యాధుల గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీబీ సూపర్వైజర్ బండి రాజారత్నం మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, జాగ్రత్తలు, ప్రభుత్వం ద్వారా ఉచిత చికిత్స గురించి వివరించారు. విద్యార్థులు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఓ సుబ్బారెడ్డి, వార్డ్ హెల్త్ సెక్రటరీ విజయలక్ష్మి, ఆశాలు ఉమా, నూర్జహాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

డిజిటల్ లావాదేవిలే ఆర్థిక ప్రగతికి మలుపు

చాపాడు : సైబర్ నెరగాళ్ల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెర్డ్స్ కో-ఆర్డినేటర్ కె.ఉదయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో గురువారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు, పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరు డిజిటల్ లావాదేవీలు, డిజిటల్ పేమెంట్స్ ద్వారా సమయాన్ని, ఖర్చులు ఆదా చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ , హెర్డ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, పొదుపు సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టేసిన ప్రభుత్వం

ప్రొద్దుటూరు : సకాలంలో యూరియా అందించక రైతులకు కూటమి సర్కార్ దిక్కుతోచని స్థితిలోకి నెట్టేసిందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు మాయ మాటలు చెప్పి కూటమి సర్కార్ మభ్యపెడుతోందన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్లో కొందామన్న దొరకడం లేదన్నారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఎప్పుడు లేదన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే రైతులకు యూరియా అందించాలని ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు.

తొండూరులో మురుగు సమస్య

తొండూరు : తొండూరులో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. వీధుల పక్కన మురుగునీరు నిల్వ ఉండి చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. సమస్యను పలుమార్లు ప్రస్తావించినా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల పెరుగుదల అధికమై వ్యాధులు వ్యాపిస్తాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిలో జారిపడే ప్రమాదం ఉందని హడలిపోతున్నారు. వెంటనే మురుగు కాలువలను శుభ్రపరచి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

తమలపాకు తోటకు తెగులు.. రైతులకు దిగులు

కొత్తపేట వద్ద సాగులో ఉన్న తమలపాకు తోట

ప్రజాశక్తి - ఖాజీపేట

తమలపాకు పంటలను సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పేలా లేదు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. పంట లకు తెగుళ్లు ఆశించడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం వేరుకుళ్లు, ఆకుకుళ్లు వంటి అనేక తెగుళ్లు చుట్టుముట్టాయి. తెగుళ్ల నివారణకు రైతులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. తెగుళ్లు ఇలాగే కొనసాగితే నష్టాలు తప్పవని రైతుల్లో ఆందోళన నెలకొంది. పెళ్లిళ్లు, పండగల సీజన్ ప్రారంభం కానుండడంతో ధరలు ఆశాజనకంగా ఉండవచ్చని రైతులు ఆశాభావంగా ఉన్నారు. తెగుళ్లు తగ్గితే దిగుబడులతోపాటు ధరలు కూడా ఉంటాయని పేర్కొంటున్నారు.

వ్యాక్సినేషన్ పట్ల నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పిల్లలకు వేసే వ్యాక్సినేషన్ పట్ల నిర్లక్ష్యం చేయవద్దని ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు జిల్లా మలేరియా వైద్యాధికారి మనోరమ సూచించారు. పట్టణంలోని అర్బన్ వైద్యశాలలో గురువారం మనోరమ మాట్లాడుతూ మాతృ, శిశు సంక్షేమం చాలా ముఖ్యమన్నారు. గర్భిణులకు సంబంధించిన రికార్డులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు అర్బన్ పరిధిలోని వ్యాక్సినేషన్ కేంద్రాలను తనిఖీ చేసేందుకు వచ్చానని ఆమె తెలిపారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అర్బన్ వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు, ఎంపీహెచ్వో శంకర్‌రెడ్డి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న వైద్యాధికారి మనోరమ

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రవిశంకర్

ప్రజాశక్తి - ముద్దనూరు

రాజుల గురువాయపల్లె ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్ కె.రవిశంకర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రవిశంకర్ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు, పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 2023-24, 2024-25 పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఆయన ఎంతో శ్రమించారు. పాఠశాలలో 67 మంది విద్యార్థులు ఉన్న సంఖ్యను 135కు పెంచడంలో ఆయన కృషి హర్షణీయం. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు పాటుపడ్డారు. ఆయన సేవలను జిల్లా అధికారులు గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. రవిశంకర్‌కు అవార్డు రావడం పట్ల ప్రధానోపాధ్యాయులు దస్తగిరి, ఉపాధ్యాయులు అమృత రాజు హర్షం వ్యక్తం చేశారు.

యువత చెడుమార్గాన వెళ్లకుండా బాధ్యత తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

యువత చెడు మార్గాన వెళ్లకుండా వారికి అవగాహన కల్పించే బాధ్యత ఎంహెచ్‌పిఎస్ తీసుకోవాలని సిఐ నరసిం హులు కోరారు. వేంపల్లె అప్‌గ్రేడ్ సిఐ నరసింహులును ఎంహెచ్‌పిఎస్ కమిటీ సభ్యులు గురువారం సత్కరించారు. పులివెందుల నియోజకవర్గం ఎంహెచ్‌పిఎస్ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మైనార్టీ ముస్లిం నేతలు సిఐని మర్యాద పూర్వకంగా కలిశారు. సన్మానానంతరం సిఐకి పూల మొక్కను అందజేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ చాలా మంది యువత చెడు అలవాట్లు వైపు వెళుతున్నారని, గుర్తించి వారిని ఆధ్యాత్మిక వైపు నడిచేలా హితబోధ చేయాలని కోరారు. రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు ముందుగా పోలీసులకు సమాచారమిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ట్రైనీ ఎస్‌ఐ సుబహాన్‌ను కూడా సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పిఎస్ ఉపాధ్యక్షుడు కరీముల్లా, సెక్రటరీ దర్బార్‌వలి, జాయింట్ సెక్రెటరీ పాలగిరి గౌస్‌పీర్, మీడియా కో-ఆర్డినేటర్ సయ్యద్ సమీర్, కెఎస్.కరీముల్లా, మహమ్మద్ గౌస్, ఖలీల్, రహీం, హుసేన్, గౌస్‌పీర్ అమీరుద్దీన్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సిఐకి పూలమొక్క అందిస్తున్న ఎంహెచ్‌పిఎస్ నాయకులు

ఉపాధ్యాయ దినోత్సవ
శుభాకాంక్షలు
బాల బాలికలను ఉత్తమ విద్యార్థులుగా
తీర్చిదిద్దుతూ రేపటి సమాజానికి దిశానిర్దేశం
చేస్తున్న ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులందరికీ
గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
షేక్.నూర్ అహమ్మద్, M.Sc., B.Ed.,
ఉపాధ్యాయులు, ఉర్దూ పాఠశాల, మాసాపేట, రాయచోటి.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
" ప్రతి అక్షరం- ప్రజల పక్షం " అన్న నినాదంతో నిజాలను నిర్భయంగా వ్రాస్తూ,
కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడి
వారికి అండగా నిలుస్తున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక 44 సంవత్సరాలు
దిగ్విజయంగా పూర్తి చేసుకొని నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
శుభ సందర్భంగా 'ప్రజాశక్తి' యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు, పాఠకులకు,
అభిమానులకు ఇవే మా హార్ధిక శుభాకాంక్షలు.
రమణ
తేదేపా నాయకులు, దిన్నెపాడు.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
రేపటి సమాజాన్ని నేటి తరగతి గదుల్లో తీర్చిదిద్దుతూ
ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు, పాఠశాల
సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ఎన్.రవీంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు,
మండల ప్రైమరీ మోడల్ స్కూల్, టి.సుండుపల్లె, అన్నమయ్య జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
రేపటి సమాజాన్ని నేటి తరగతి గదుల్లో తీర్చిదిద్దుతూ
ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు, పాఠశాల
సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాయవరం, టి.సుండుపల్లె మండలం, అన్నమయ్య జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
నేటి బాలలను భావి భావి భారత పౌరులుగా
తీర్చిదిద్దే ఉపాధ్యాయుని,
ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు
శ్రీ సుక్రీత్ యూపి స్కూల్
చిన్నమండెం, అన్నమయ్య జిల్లా.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
" ప్రతి అక్షరం- ప్రజల పక్షం " అన్న నినాదంతో నిజాలను నిర్భయంగా వ్రాస్తూ,
కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా నిలుస్తున్న ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక 44 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని నేడు 45వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న శుభ సందర్భంగా 'ప్రజాశక్తి' యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు,
పాఠకులకు, అభిమానులకు ఇవే మా హార్ధిక శుభాకాంక్షలు.
45 వార్షికోత్సవం
కె. ఉషారాణి, ఈఓపిఆర్‌డి
లక్కిరెడ్డిపల్లి.

ట్రిపుల్ఐటిలో సివిల్స్‌పై ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
45వ వార్షికోత్సవం
తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడితో
ప్రజా పక్షపాతిగా వుంటూ ప్రజల హృదయంలో
చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్న
ప్రజాశక్తి దినపత్రిక మరింత పురోభివృద్ధి చెందాలని
విలేకర్లకు, సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజాశక్తి అభిమాని
లక్కిరెడ్డిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా.

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయుకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటిలో సివిల్స్‌పై విద్యార్థులకు ఉచిత శిక్షణ, ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం ఇడుపులపాయి ట్రిపుల్ఐటిలో పోటీ పరీక్షల విభాగం అధికారి డాక్టర్ కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. 85 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై మెరిట్‌లో ఎంపికైన విద్యార్థులకు కోణం స్వచ్ఛంద సంస్థ తరపున ఉచిత శిక్షణతో పాటు ఫెలోషిప్ కూడా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఓ డాక్టర్ పెనుకొండ రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్ రమేష్ కైలాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమ్మేళనం తీర్మానాలపై వినతిపత్రం

ప్రజాశక్తి - వేంపల్లె

బ్రాహ్మణ సమ్మేళనంలో చేసిన తీర్మానలను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్‌కు అందజేసినట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరి ప్రసాదరావు తెలిపారు. గురువారం అమరావతిలో ఉన్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్‌ను బ్రహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరి ప్రసాదరావు కలిశారు. బ్రాహ్మణ కార్పొరేషన్, క్రెడిట్ సొసైటీలకు పూర్తిస్థాయిలో గవర్నింగ్ బాడీలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. దూపదీప నైవేద్యం కింద ఉన్న అర్చకుల పిల్లలకు తల్లికివందనం పథకం మంజూరు కాలేదని, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని కోరామన్నారు. జిల్లాకు రెండు బ్రాహ్మణ భవన్‌లు మంజూరు చేయాలని విన్నవించినట్లు చెప్పారు. కొత్తగా 700 దేవాలయాలకు దూపదీప నైవేద్యం కింద ప్రభుత్వం నిధుల విడుదలకు ఆమోదం తెలిపినట్లు చైర్మన్ పేర్కొన్నారని ప్రసాదరావు తెలిపారు.

హోలీస్టిక్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత చికిత్స

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణంలోని హోలీస్టిక్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ వర్మ తెలిపారు. ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రొద్దుటూరుకు చెందిన ఖాజాబీ అనే మహిళ హార్ట్ బీట్ తగ్గడం వల్ల కళ్లు తిరిగి పడిపోయిందన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ఉచిత చికిత్స అందించామన్నారు. టెంపరరీ ఫేస్ మేకర్ అమర్చినప్పటికీ ఫలితం లేకపోవడం వల్ల పర్మనెంట్ పేస్‌మేకర్ అమర్చి బాగు చేశామన్నారు. ఇలాంటి శాస్త్ర చికిత్స చేసేందుకు అత్యాధునిక పరికరాలు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా గుండె, ఎముకల, నరాల, జనరల్ సంబంధిత సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. గుండె సంబంధిత సర్జరీని చిత్ర ప్రదర్శన ద్వారా సమావేశంలో ప్రదర్శించారు. ఈ వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ నరసింహారావు, సిఇఒ శరత్ బాబు కోరారు.

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం- ప్రజల పక్షం అనే నినాదంతో
దినదినాభివృద్ధి చెందుతూ... ప్రజా సమస్యల పరిష్కారం
దిశగా అనునిత్యం ఉద్యమించే దినపత్రిక ప్రజాశక్తి
45వ వార్షికోత్సవం సందర్భంగా
పాఠకులకు, సిబ్బందికి ఇవే మా హార్థిక శుభాకాంక్షలు
డా॥ రియాజ్ బేగ్, మెడికల్ ఆఫీసర్,
మరియు కోణంపేట పిహెచ్‌సి సిబ్బంది

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం- ప్రజల పక్షం అనే నినాదంతో
దినదినాభివృద్ధి చెందుతూ... ప్రజా సమస్యల పరిష్కారం
దిశగా అనునిత్యం ఉద్యమించే దినపత్రిక ప్రజాశక్తి
45వ వార్షికోత్సవం సందర్భంగా
పాఠకులకు, సిబ్బందికి ఇవే మా హార్థిక శుభాకాంక్షలు
కిషోర్, ఎ.ఇ.,
ఆర్‌డబ్ల్యుఎస్, లక్కిరెడ్డిపల్లి, అన్నమయ్య జిల్లా.

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం- ప్రజల పక్షం అనే
నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ...
ప్రజా సమస్యల పరిష్కారం దిశగా
అనునిత్యం ఉద్యమించే దినపత్రిక
ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా
పాఠకులకు, సిబ్బందికి
ఇవే మా హార్థిక శుభాకాంక్షలు
మనోహర్ రెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారి,
బీసీ బాయ్స్ హాస్టల్, దేవళంపల్లి.

ఉపాధ్యాయ దినోత్సవ
శుభాకాంక్షలు

నేటి బాలలను భావి భావి భారత
పౌరులుగా తీర్చిదిద్దే గురువులకు
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
బి. నారాయణ రెడ్డి
ప్రధానోపాధ్యాయులు, గొంటువారిపల్లె,
కాశినాయన మం॥, వైఎస్ఆర్ కడప జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

బోధన మరియు విద్యారంగానికి తన జీవితాన్ని
అంకితం చేసిన భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త
అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును గురుపూజోత్సవంగా
ఆచరిస్తున్న ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు
డి. ప్రేమ రాణి
ప్రధానోపాధ్యాయిని
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీలేరు.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
నేటి బాలలను భావి భావి భారత పౌరులుగా
తీర్చిదిద్దే ఉపాధ్యాయిని,
ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు
బి. వెంకటేష్ నాయక్
MEO-1, టి.సుండుపల్లె మండలం, అన్నమయ్య జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
బాల బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ
రేపటి సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయినీ
ఉపాధ్యాయులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు...
ఎమ్. రవీంద్ర నాయక్
MEO-2, టి.సుండుపల్లె మండలం, అన్నమయ్య జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ
శుభాకాంక్షలు

బాలబాలికలను ఉత్తమ విద్యార్థులుగా
తీర్చిదిద్దుతూ రేపటి సమాజానికి దిశ నిర్దేశం
చేస్తున్న ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులందరికీ
గురుపూజోత్సవ శుభాకాంక్షలు
కె. మోహన్ బాబు
ప్రధానోపాధ్యాయులు, వరికుంట్ల జడ్పీహెచ్ స్కూల్,
కాశినాయన మం॥, వైఎస్ఆర్ కడప జిల్లా.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

రేపటి సమాజాన్ని నేటి తరగతి గదుల్లో
తీర్చిదిద్దుతూ ఉత్తమ విద్యాబోధన చేస్తున్న
ఉపాధ్యాయులకు, పాఠశాల
సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ఎన్. రాధిక
ఎస్.జి.టి., ఎంపిపి స్కూల్,
రెడ్డి కొట్టాల, ఎస్టీ కాలనీ, కాశినాయన మండలం.

విరాళాన్ని అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

అన్న క్యాంటీన్లకు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-రాయచోటి: ఎంతో మందికి ఆకలిని తీర్చుతున్న రెండు అన్న క్యాంటీన్ల నిర్వహణకు రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.2 లక్షలను విరాళాన్ని నిర్వాహకులకు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద ప్రజలు కోసం అన్న క్యాంటీన్ పట్టణంలో రెండు చోట్ల ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా ప్రజలకు అన్నం పెడుతున్నారు.

త్యాగనిరతికి ప్రతిబింబం మహమ్మద్ ప్రవక్త జీవితం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : త్యాగనిరతికి ప్రతిబింబం మహమ్మద్ ప్రవక్త జీవితమని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవ జాతికి ఆదర్శమన్నారు. సామరస్యం, సోదరభావం, ఇతరుల పట్ల ప్రేమ ప్రవక్త చూపిన మార్గాలని, ఆ మార్గాలలో ప్రజలం దరూ నడవాలన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రజల్లో సోదరభావం, సహనం, కరుణ, ఐక్యతలను మరింత పెంపొం దించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు మిలాద్ ఉన్‌నబీ శుభాకాంక్షలు తెలిపారు.

గురువులే సమాజ మార్గదర్శులు : తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువులు జీవితానికి దిక్సూచి చూపిస్తారు. వారే శిష్యుల భవిష్యత్తుకు బీజం వేయగల మహాశక్తులని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దేశానికి గర్వకారణమైన తాత్వికవేత్త, విద్యావేత్త, భారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా పాటించడం ఈ దేశ సంస్కృతి, విలువల పట్ల గల గౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. గురువు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదని, జీవితం ఎలా గడపాలో, ఆత్మవిశ్వాసం ఎలా పెంచుకోవాలో నేర్పించే మార్గదర్శి అని చెప్పారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: భారతదేశంలోనే అప్పులు చేయడంలో ఆంధ్ర రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా చంద్రబాబు నిలిపారని వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.మూడు లక్షల కోట్ల అప్పు చేస్తే, చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కాకముందే అంతకు మించి అప్పులు చేశారని చెప్పారు. రాష్ట్ర మొత్తం రైతులందరూ రోడ్లమీదకి వచ్చి ఎరువులకోసం పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. మామిడి, ఉల్లి, పోగాకు, మిర్చి,చీనీ, వరి, పత్తి రైతులు రోడ్లెక్కి. ధర్నాలు చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు.

చేతులెత్తినా... ఆగని ఆర్‌టిసి బస్సులు..?

డ్రైవర్, కండక్టర్ల నిర్లక్ష్యం
ఖాళీగా ఉన్నా ఆపని వైనం
అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు
గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి

బస్సులు ఆపకపోవడంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చేతులెత్తినా.. ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొంత మంది డ్రైవర్లు, కండక్టర్ల నిర్లక్ష్యం బస్సులు ఆపకుండా వెళ్లిపోతుండడంతో గంటల తరబడి బస్టాండ్‌లో కూర్చోని అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు, మహిళలు వాపోతున్నారు. సాయంత్ర సమయంలో పాఠశాలలు వదలడంతో విద్యార్థినీ, విద్యార్థులు బస్సులు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని, బస్సులు ఖాళీగా ఉన్నా చేతులెత్తితే ఆపకుండా వెళ్లిపోతున్నారని విద్యార్థులు మండిపడు తున్నారు. కొన్ని బస్సుల్లో డ్రైవర్లు ఆపు తున్నా.. కండక్టర్లు ఆపనీయకుండా చేస్తు న్నారని, మరికొన్ని బస్సుల్లో కండక్టర్లు ఆపమన్నా.. డ్రైవర్లు ఆపకుండా వెళ్లిపో తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 5గంటలకు పాఠశాల వదిలితే దాదాపు గంట పాటు బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గంట వ్యవధిలో దాదాపు ఐదు నుంచి ఎనిమిది పల్లె వెలుగు బస్సులు వస్తాయని.. చేతులె త్తుతున్నా ఆపకుండా వెళ్లిపో తున్నారని ఆవేదన చెందారు. గంటల తరబడి వేచి ఉండి, ఏ బస్సు ఆపితే ఆ బస్సుకు వెళ్తుండడంతో ఇంట్లో రాత్రి అవుతుందని, పిల్లలు చదువు కునేందుకు కూడా సమయం లేకుండా పోతుందని విద్యార్థుల తల్లిదం డ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీనాలీ చేసి తమ పిల్లలను చదివిం చుకునేందుకు దాదాపు 15 కిలో మీటర్ల నుంచి వాల్మీకి పురం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపుతు న్నామని, బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని తల్లిదండ్రులు కన్నీటిపర్యం తమవుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు సైతం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుం డడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

ఎందుకంత నిర్లక్ష్యం : చేతులెత్తుతున్నా.. బస్సు ఆపేందుకు డ్రైవర్లు ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థంకాని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. ఎంతో మంది వివిధ పనులపై, ఉద్యోగాల నిమిత్తం, చదువు నిమిత్తం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల కోసం పడిగాపులు పడుతుంటే సమయానికి వచ్చే బస్సు ఖాళీగా ఉన్నా కూడా ఆపకుండా వెళ్లిపోతుండడంతో ఆర్టీసీ డ్రైవర్లు, అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయానికి ఉద్యోగాలకు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లకపోతే చాలా అవస్థలు పడాల్సి వస్తోందని, సమయానికి వచ్చే బస్సులు చేతులెత్తితే ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాలనీలోనూ ఇదే పరిస్థితి : మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఇందిరమ్మ కాలనీలో దాదాపు 2వేలకు పైగా జనాభ ఉండడంతో వారు ప్రయాణాలు చేసేందుకు బస్సులు ఆపడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడాలి: ఆర్టీసీ ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి.. ఎక్కడ ఏమి జరుగుతుందో నిఘా ఉంచాలని, బస్టాండ్లల్లో బస్సులు ఆపకపోతే గ్రామాల్లో ఏమి ఆపుతాన్నారో అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను ఆపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

9న కలెక్టరేట్ ఎదుట ధర్నా : వైసిపి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతాంగ సమస్యలపై శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం అండగా నిలిచిన వ్యక్తి, రైతు పక్షపాతి మాజీ సిఎం జగన్ అని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవడం, యూరియా కష్టాలు, గ్రామీణ ప్రజలపై స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలు భారాన్ని అక్షేపించారు. టమోటా, బొప్పాయి, మామిడి రైతులు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలను చవి చూశారన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం రమేష్, మహేష్ బాబు, జన్నే రాజేంద్ర నాయుడు, ఈశ్వర్ నాయక్, బండపల్లి వెంకట రమణ, చిప్పిలి జగన్నాద్‌రెడ్డి, ఆవుల విశ్వనాథ్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించబోవు రైతుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి రైతు విభాగం అధ్యక్షులు కొత్తమద్ది వెంకటసుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ రైతుల నిరసనకు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్‌టిఐ వింగ్ అధ్యక్షులు సుబ్బరాజు, పట్టణ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు గోవింద బాలకృష్ణ, రాజంపేట మండల కన్వీనర్ భాస్కర్ రాజు, రాజంపేట నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు దాసరి పెంచలయ్య, సోషల్ మీడియా ప్రతినిధి కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో 1161.95 మెట్రిక్ టన్నుల యూరియా : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ప్రస్తుతం 1161.95 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాలలో, ప్రయివేట్ ఫర్టిలైజర్ షాపులలో కింద తెలిపిన విధంగా యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్‌లో 49.95 ఎంటిఎస్, రైతు సేవా కేంద్రాల్లో 608 ఎంటిఎస్, ప్రయివేట్ ఫర్టిలైజర్ షాపుల్లో 504 ఎంటిఎస్ 1161.95 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు ఎవరూ కూడా ఇబ్బందులు పడకూడదని తెలిపారు. ఆయా మండలాల పరిధిలోని కేంద్రాల్లో ఎరువులు అందుబాటు ఉన్నాయన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎస్టీ హాస్టల్ విద్యార్థులతో కలిసి చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యారంగ సమస్యలపైన విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎక్కడా చర్చించిన దాఖలాలు లేవన్నారు. పాఠశాలలు, కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ ఇచ్చిన జిఒలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ.6,400 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలను నెలకు రూ.3 వేలకు పెంచాలని, ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తున్న జిఒ 42, 35 రద్దు చేయాలని, యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న కమాటి, కుక్కు, వార్డెన్ పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యుడు జయబాబు, సమీర్, గోవర్ధన్, శివకుమార్, జీవన్ నాయక్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడు దల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాయచోటి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు సతీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందన్నారు. జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులందరికీ కూడా ఫీజు రీయింబర్స్‌మెర్ అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులకు నెలకు రూ.3 వేలు మెస్ ఛార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్‌ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు ఏవి కూడా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయక పోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఇప్పటికే దశల వారి పోరాటాలు నిర్వహించిందన్నారు. ప్రభుత్వ ప్రతినిధులకు వినతి పత్రాలు అందించినాఏమాత్రం ఉపయోగం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులు నొక్కేసే విధంగా విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లోకి నిషేధిస్తూ ఇచ్చినటు వంటి జీవోను వెంటనే ఉపసంహరించుకోవాని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని తమ హక్కు లను సాధించుకోవాలి ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లోకేష్, సాయిపీర్, తిరుపతి, మారుతి, శివ, సుబ్బా రాయుడు, నాగార్జున, హర్ష, హర్షద్ పాల్గొన్నారు.

మదనపల్లె : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డ్రైవింగ్ లైసెన్స్, సైబర్ నేరాలపై అవగాహన

మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ కులాయప్ప

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత, సైబర్ క్రైమ్స్ నివారణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్. కుళ్లాయప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడికీ చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా ప్రమాదకరమని చెప్పారు. యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం అలవాటు చేసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ ప్రాణాలతో పాటు భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు. అలాగే, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలను దృశ్యరూపంలో విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఫేక్ కాల్స్, ఫిషింగ్ మెసేజ్‌లు, సోషల్ మీడియా మోసాలు, బ్యాంకింగ్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పారు. ఒటిపి, పాస్‌వర్డ్, ఆధార్, బ్యాంక్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద లింకులు, అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులను వెంటనే నివారించాలని చెప్పారు. ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ తరహా అవగాహన కార్యక్రమాలు విద్యార్థులలో చట్టపరమైన అవగాహన పెంచి, బాధ్యతాయుత పౌరులుగా సమాజంలో అడుగుపెట్టేలా చేస్తాయి. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడం, రోడ్డు భద్రతను కాపాడుకోవడం ప్రతి విద్యార్థి కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వరూప

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలోని ఆడబిడ్డలకు సంరక్షణ, వారికి మంచి విద్యను అందివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప, సిహెచ్ఒ సరస్వతి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పీలేరు ప్రాజెక్టు కార్యాలయం ఆవరణంలో గురువారం బేటీ బచావో – బేటీ పడావోపై అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడబిడ్డల బాల్యవివాహాలను అరికట్టడంలోనూ అందరం కీలక బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఆడపిల్లలను ఉన్నతంగా చదివించి వారికి మంచి భవిష్యత్తును అందివ్వాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రికి ఉందని చెప్పారు. అదేవిధంగా సమాజంలో వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు, బాలికల్లో వచ్చే మార్పులు, ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం గురించి, అనీమియా సమస్యల నివారణ గురించి క్షుణ?ంగా తెలియజేశారు. మనం తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, మినరల్స్, ఫైబర్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకునేలా వారిని ప్రోత్సహించాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లలను కాపాడదాం, ఆడపిల్లల్ని చదివిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. సమావేశంలో అంగన్వాడీ పర్యవేక్షకులు ఉమ, అక్కయ్యమ్మ, స్వర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి మద్దతుగా పోస్టుకార్డు ఉద్యమం

- ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ

ప్రజాశక్తి-పీలేరు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓట్ – చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా పీలేరులో పోస్ట్ కార్డ్ ఉద్యమం జరిగింది. దేశ ప్రజాస్వామ్య రక్షణ కోసం ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో గురువారం పీలేరు పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయ పోస్ట్ బాక్స్ ద్వారా రాష్ట్రపతికి పోస్ట్ కార్డులు పంపించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ "ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైందని, కానీ నకిలీ ఓటర్ల ద్వారా జరుగుతున్న ఓటు చోరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. ఓట్–చోర్ ని అరికట్టడానికి రాష్ట్రపతి వెంటనే జోక్యం చేసుకుని డిజిటల్ ఓటరు జాబితాను ప్రచురించడమే కాకుండా, ఓటు చోరిని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం, రాజ్యాంగం ద్వారా ప్రజలు పొందిన ఓటు హక్కును కాపాడడానికి ఒక యోధుడిలా ఉద్యమానికి సిద్ధమయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ – చోర్ ఉద్యమానికి రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని తెలియజేశారు. ఓట్ – చోర్ అంశం పై ఇదివరకే రాహుల్ గాంధీ మీడియాకు ఆటంబాంబు లాంటి వాస్తవాలు తెలియజేశారని గుర్తు చేశారు. మరికొద్ది రోజుల్లో హైడ్రోజన్ బాంబు లాంటి మరిన్ని ఆధారాలు ప్రజల ముందు పెట్టబోతునన్నట్టు రాహుల్ గాంధీ ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్, లోకేష్, యశ్వంత్, మహేంద్ర, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాలను పోస్టు డబ్బాలో వేస్తున్న నాయకులు

విద్యార్థి సంఘాలపై అక్రమ కేసులు బాధాకరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాపాడాలని నిరసన వ్యక్తం చేశారన్న నెపంతో వైసిపి ప్రభుత్వం విద్యార్థి సంఘాలపై అక్రమ కేసులు బనాయించడం బాధాకరమని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. కేసుకు సంబంధించి గురువారం రాజంపేట జిల్లా కోర్టుకు హాజరైన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం టిఎన్ఎస్ఎఫ్ నాయకులుపై అనేక అక్రమ కేసులు పెట్టారని, జగన్ ప్రభుత్వంలో నిరంకుశ పాలన జరిగిందని, ఎదిరించిన ప్రతి ఒక్కరిని ఏదో ఒక తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేసేమన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు నివసిస్తున్నారన్నారు. తదుపరి వాయిదా అక్టోబర్ 17వ తారీకున ఉన్నట్లు తెలిపారు. కోర్టుకు హాజరైన వారిలో తెలుగు యువత అసెంబ్లీ అధికార ప్రతినిధి సీనేపల్లి హరీష్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సురేష్ బాబు, కరుణాకర్ రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

నేలమల్లేశ్వర స్వామి దేవస్థాన అధ్యక్షుడిగా రెడ్డిమోహన్

-రాజకీయాల్లో ఎదగడం ముళ్లదారుల్లో నడిచినట్టే ఆర్.జె.వెంకటేష్ వెల్లడి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

స్థానిక తవళం గ్రామంలో వెలసిన నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులుగా ఇటీవల మరణించిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి మేష రామకృష్ణ కుమారుడు రెడ్డిమోహన్‌ని స్థానిక ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నిమ్మన పల్లిలో, తవళంలో ఏర్పాటు చేసిన మేష రామకృష్ణ సంతాప సభలో రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయంలో ఎదగాలని ప్రతిఒక్కరు కోరు కుంటారని, అయితే రాజకీయాల్లో ముళ్ల దారులు ఉంటాయే తప్ప పూల దారు లు ఉండవన్నారు. అలాంటి రాజకీయాల్లో ప్రజల దగ్గర పేరు సంపాదిం చుకొని జవాబుదారిగా ఎదిగిన నేత మేష రామకృష్ణ అని, అలాంటి నాయకుడు అందరికి దూరమవ్వడం చాలా భాదా కరమైన విషయమన్నారు. నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులుగా రామకృష్ణ ఎన్నుకోవాలని కొద్దిరోజుల ముందే ఎంపిక చేసినప్పటికీ, కొన్నికారణాల వల్ల వెల్లడించలేక పోయామన్నారు. ఇంతలో ఆయన అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో ఆ బాధ్యతను ఆయన కుమారుడికి ఇవ్వడం సరైన నిర్ణయంగా భావించి అందరూ కలసి ఏకగ్రీవం చేసామన్నారు. గత నలభై సంవత్సరాల నుండి రాజకీయాల్లో ఉంటూ, పార్టీకి ఎనలేని సేవ చేసిన రామకృష్ణ కు తనకు మధ్య ఉన్న స్నేహాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, పార్టీ మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మాజీజడ్‌పిటిసి రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరత్న,సుధాకర్,మోహన్, లక్ష్మన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అసత్య ప్రచారాలు మానుకొని అసెంబ్లీకి వెళ్లి రాజంపేట అభివృద్ధికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాటుపడాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. బుధవారం ఆకేపాటి మీడియాతో మాట్లాడిన తీరుపై గురువారం టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సిఎం చంద్రబాబు రాజంపేట ప్రజలకు మంచి చేస్తామంటే దొంగ ఏడుపులా అని ప్రశ్నించారు. రాజంపేటకు అన్యాయం చేసినప్పుడు జగన్మోహన్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించలేదని, దమ్ముంటే అసెంబ్లీకి వెళ్లి రాజంపేటపై పోరాడాలన్నారు. రాజంపేటకు అన్యాయం చేసిన పార్టీకి రాజీనామా చేసి ప్రజలతో కలిసి జిల్లా కేంద్రం కోసం కృషి చేయాలన్నారు. జగన్మోహన్ రెడ్డి తప్పు చేశాడని ఒప్పుకునే దమ్ము మీకుందా అని నిలదీశారు. రాజంపేటకు అన్యాయం జరిగినా ఆకేపాటి మాత్రం ఆస్తులు పెంచుకున్నాడని ఆరోపించారు.రాజంపేటకు అన్యాయం చేసింది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు.ఇప్పటికే జిల్లా కేంద్రాలపై మంత్రివర్గ కమిటీ పని చేస్తోందని, రాజంపేట నియోజ కవర్గంలో ప్రాజెక్టులను, కార్యాలయాలను, జిల్లా కేంద్రాలను, వైద్య కళాశాలను వైసిపి ప్రభుత్వంలో తరలించుకుపోతుంటే ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. రాజంపేటకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకే ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

- రూ.1.30 లక్షల నిధులు గోల్‌మాల్
- ఎపిఒ, ఇద్దరు టిఎలకు షోకాజ్ నోటీసులు
- డ్వామా పీడీ వెంకటరత్నం వెల్లడి

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ.1.30 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. గత ఏడాది ఆగస్టు 18 నుంచి ఈ ఏడాది ఆగస్టు 26 వరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1,226 పనులకుగాను రూ.5.69 కోట్ల నిధులను ఖర్చుచేశారు. ఉపాధి హామీ ద్వారా జరిగిన ఈ నిధుల వినియోగంపై ఎస్ఆర్‌పి తిరుమలేష్ పర్యవేక్షణలో 12 మంది డిఆర్‌పిల బృందం గత 10 రోజుల పాటు మండలంలో పూర్తి చేసిన పనులను తనిఖీ చేశారు.డ్వామా పీడీ సమక్షంలో జరిగిన బహిరంగ సభలో ఆడిట్ అధికారులు నిధుల దుర్వినియోగం వివరాలను వెల్లడించారు.అదే విధంగా ఆడిట్ సిబ్బంది తనిఖీలో పొంతనలేని రూ.17.93 లక్షల నిధులు దుర్వినియోగంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ఏపీడీని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహించిన ఎపిఒ మంజుల, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణ, మణికంఠలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు క్రిష్ణకుమార్, నరసింహులును విధుల నుంచి తొలగించామని పీడీ పేర్కొన్నారు. ఎంపిపి లక్ష్మీ నరసమ్మ, క్లస్టర్ ఎపిడి నందకుమార్, ఎంపిడిఒ క్రిష్ణవేణి, ఎపిఒ వెంకటేష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టుపోయింది

కడప జిల్లా, వేంపల్లె గ్రామంలోని కాలేజీ రోడ్డు, శ్రీరాంనగర్, డోర్ నెంబర్ 13-239 - T -9-1లో నివాసం ఉంటున్న పఠాన్ ఖాజా, తండ్రి పఠాన్ పీరాకు చెందిన పాసుపోర్టు **(E6407960)** జిరాక్స్ కోసం తీసుకొని వెళుతుండగా వేంపల్లెలోని బ్యాంక్ సర్కిల్ పోయింది. పాస్‌పోర్ట్ దొరికిన వారు ఈ ఫోన్ నెంబర్‌కు **8179366318** సమాచారం ఇవ్వాలి.

LOST OF PASSPORT

I, **MALLUGARI CHIRANJEEVI**, S/O. MALLUGARI LAKSHMI NARASAIAH, D.No. 2/115, Maheswara Nagar, Yerraguntla, YSR Kadapa Dist-516309, A.P., LOSS OF **PASSPOT NO. E1804784,** That My original Passport was lost while I am Shifting House at Transport on **04-08-2025,** ANY ONE TRESS OUT GIVE ME PLEASE CELL : 9849385888

CHANGE OF NAME

I am **ZAMRUTH BEGUM** (My old Name) resident 6/265, KHM Street,YSR District, AP. Here by declare that I have added my surname as **SHERWANI ZAMRUTH BEGUM**(New Name).

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

బాల బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ
రేపటి సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న
ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

లక్ష్మి హోమియో క్లీనిక్

శ్రీరామ్ ఫైనాన్స్ బిల్డింగ్,
సాగర్ అపార్ట్‌మెంట్స్ ప్రక్కన,
కదిరి రోడ్, మదనపల్లి.
సెల్: 94905 36641

ఆర్.జయరామ్ రెడ్డి
S.A. (Maths).,

డా॥ కె.లక్ష్మిదేవి
B.H.M.S.,

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడితో
ప్రజా పక్షపాతిగా వుంటూ ప్రజల హృదయంలో చెరిగిపోని
స్థానాన్ని సంపాదించుకున్న ప్రజాశక్తి
దినపత్రిక మరింత పురోభివృద్ధి
చెందాలని విలేకర్లకు,
సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

డా॥ ఎస్.సుధీర్‌నాధ్ బెనర్జీ

సహాయక సంచాలకులు,
పశువైద్యశాల,
లక్కిరెడ్డిపల్లి.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడితో
ప్రజా పక్షపాతిగా వుంటూ ప్రజల హృదయంలో
చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్న
ప్రజాశక్తి దినపత్రిక మరింత పురోభివృద్ధి చెందాలని
విలేకర్లకు, సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మాధవి లతా

వసతి సంక్షేమాధికారిణి,
బీసీ బాలికల వసతి గృహం, లక్కిరెడ్డిపల్లి.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రతి అక్షరం- ప్రజల పక్షం అనే నినాదంతో
దినదినాభివృద్ధి చెందుతూ... ప్రజా సమస్యల
పరిష్కారం దిశగా అనునిత్యం ఉద్యమించే
దినపత్రిక ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా
పాఠకులకు, సిబ్బందికి ఇవే మా హార్థిక శుభాకాంక్షలు

ఆర్. మనోహర్

హెచ్‌డబ్ల్యుఓ,
ఎస్సీ బాయ్స్ హాస్టల్, లక్కిరెడ్డిపల్లి.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడితో
ప్రజా పక్షపాతిగా వుంటూ ప్రజల హృదయంలో చెరిగిపోని
స్థానాన్ని సంపాదించుకున్న ప్రజాశక్తి
దినపత్రిక మరింత పురోభివృద్ధి చెందాలని విలేకర్లకు,
సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

వై. ధర్మరాజు

తేదేపా నాయకులు,
నరసింహరాజు పల్లి.

హెచ్‌ఎంలకు ఉత్తమ పురస్కారాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

పనితీరులో రాష్ట్రస్థాయి గుర్తింపు సాధించిన కడప నగరపాలక ప్రధానోపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి. కడప గాంధీనగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.నాగమణి, సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాది నాగరాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. నాగమణి గతంలో మెయిన్ స్కూల్‌లో పని చేసిన సమయంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. ఒక్క సెలవు కూడా ఉపయోగించుకోకుండా బాధ్యతలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారు. పాఠశాలకు క్రీడల్లో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు రావడంలోనూ పాఠశాలను అభివద్ధి పథంలోనూ నడిపించారు. ఇటీవల నిర్వహించిన మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో కడప 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సైతం అభినందించిన విషయం తెలిసిందే. తన సర్వీసు కాలంలో ఒక్క నిమిషం కూడా పాఠశాలకు ఆలస్యంగా వెళ్లకపోవడం, విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు 'బాల సంస్కార్' కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు, విద్యార్థుల చేతిరాతను మార్చేందుకు నిర్వహిస్తున్న 'క్యాలీగ్రఫీ' వంటి వినూత్న కార్యక్రమాలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు మీరు ఇరువురిని పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నాయకులను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ఎపిజెఎసి ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి ఛైర్మన్ ఆలపర్తి విద్యాసాగర్ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య వైస్ ఛైర్మన్‌గా, ఎఐఎస్‌జిఎఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డి.వి.రమణ ఎన్నిక కావడంతో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీష్‌తో కలిసి విజయ వాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి యజేశారు. అనంతరం వారిని ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, జిల్లా నాయకులు నిత్యపూజయ్య, నగర ఉపాధ్యక్షులు పద్మనాభం, ముద్దనూరు కార్యదర్శి జాన్సన్ పాల్గొన్నారు.

వృత్తి ధర్మంతోపాటు

పేద విద్యార్థులకు సాయం చేయడమే లక్ష్యం

సెకండరీ గ్రేడ్ టీచర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు రాధిక

ప్రజాశక్తి-కాశినాయన

వత్తి ధర్మం నెరవేర్చి పేద విద్యార్థులకు సహాయం చేయడమే తన లక్ష్యమని తాను ఏ పాఠశాలలో పనిచేసినా ముందుగా వత్తి ధర్మాన్ని నెరవేరుస్తూ పేద విద్యార్థులకు విద్యతోపాటు వారి చిన్ని చిన్ని అవసరాలు తీరుస్తూ అభివద్ధికి సహకరిస్తానని రెడ్డి కొట్టాల ఎస్‌టి ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు లు రాధిక పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆమె గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. తాను గతంలో చిట్వేలు, కలస పాడు, కాశినాయన మండలాలలో పనిచేశానని చెప్పారు. 2005వ సంవత్సరంలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయినిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పని చేసిన ప్రతి పాఠశాలలోనూ తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నానని తెలిపారు. విద్యార్థులను, ఆటపాటలతో, ప్రేమతో బోధన చేసి కథలతో నైతిక విలువలు నేర్పి, ఆనంద కరమైన, ఆహ్లాదకరమైన తరగతిగది వాతావరణాన్ని సష్టించి భావి తరాలను తీర్చిదిద్దే విశిష్టమైన సేవాయజ్ఞంలో తల్లిద ండ్రులు, గ్రామస్థుల సంపూర్ణ సహకారాన్ని పొందడంలో సఫలీక తులయ్యానని పేర్కొన్నారు. అనేక సందర్భాలలో అధికారులు, తల్లిదండ్రుల మన్ననలను పొందానన్నారు. పాఠశాలల విలీనం లాంటి క్లిష్ట సమ యంలోనూ నరసాపురం ప్రాథమిక పాఠశాల పౌండేషనల్ పాఠశాలగా మారి కేవలం 1,2 తరగతులతో మూసివేతకు చేరువలో ఉన్నపుడు విద్యార్థుల సంఖ్యను 5 నుండి 23 కు పెంచి, పాఠశాల ఉనికిని కాపాడడంలో ఎనలేని కషి చేశానని చెప్పారు. వినూత్న బోధనా పద్ధతులతో, డిజిటల్ ఉపకరణాల సమర్థ వినియోగంతో విద్యార్థుల్లో మంచి ప్రమాణాలను సాధించి తల్లిదండ్రుల విశ్వాసాన్ని, ప్రభుత్వ బడి పట్ల వున్న నమ్మకాన్ని రెట్టింపు చేశానని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న రెడ్డికొట్టాల ఎస్‌టి కాలనీ ప్రాథకమిక పాఠశాలలోనూ అడవి బిడ్డలైన యానాది పిల్లలను బడివైపు మరల్చడానికి, పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి ఎంతగానో కషిచేస్తున్నానని చెప్పారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం, సమరూప దుస్తులు కుట్టించడం లాంటి కార్యక్రమాలను చేస్తూ తల్లిదండ్రులకు నిరంతరం అందుబాటులో ఉంటూ అడవిబిడ్డలను ప్రేమతో అక్కున చేర్చుకొని, వారిలో అక్షర జ్ఞానం పెంపొందించడానికి నిస్వార్థంగా, అంకిత భావంతో పనిచేస్తున్నందుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం. నిజమైన గురుపూజోత్సవ కానుకగా ఆమె పేర్కొన్నారు.

ఉత్తమ అవార్డులకు ఎంపికైన కృష్ణారావు, రియాజున్నిసా

వైవీయూ ఆచార్యులకు రాష్ట్ర ఉత్తమ అవార్డులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి వైవీయూ కెమిస్ట్రీ ఆచార్యులు కె.ఎస్.వి కృష్ణరావు, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ప్రొఫెసర్ కె. రియాజున్నిసాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు విద్యా , పరిశోధనా రంగాలలో ఆచార్య కష్ణరావు సేవలు, కషి పరిగణనలోనికి తీసుకుని ఈ అవార్డు ప్రదానం చేశారు. ఆచార్య కష్ణరావు విశ్వవిద్యాలయంలో 'పాలిమర్ బయోమెటీ డిజైన్ అండ్ సింథసిస్' పరిశోధన బందానికి నాయకత్వం వహిస్తున్నారు. మరో ప్రొఫెసర్ కె. రియాజున్నీసా ఓస్నాబ్రక్ విశ్వవిద్యాలయం నుంచి డిఎఎడి ఫెలోషిప్ అందుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ నుంచి యంగ్ సైంటిస్ట్ అవార్డు పొందారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, అసోసియేట్ ఫెలో, దేశంలో ఫెలో ఆఫ్ స్కాలర్స్ అకడమిక్ అండ్ సైంటిఫిక్ సొసైటీ, టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అఖిల్ భారతీయ శిక్షక్ వర్షిక్ సమ్మాయ్లాన్ -2022బీ ఐకాన్ ఆఫ్ ఇండియా-2023 విశిష్ట శాస్త్రవేత్త అవార్డులను సొంతం చేసుకున్నారు . ఈమె పర్యవేక్షణలో ముగ్గురు డాక్టరేట్లు అందుకోగా మరో ఐదుగురు పరిశోధన సాగిస్తున్నారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్నందుకు వారిని విసి అల్లం శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్. టి. శ్రీనివాస్ రసాయనశాస్త్ర విభాగం అధ్యాపకులు అభినందించారు.

'ఉర్దూ'పై చిన్నచూపు తగదు

- సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

మాతభాషలో విద్యను అభ్యసించడం ఆయా వర్గాల హక్కు అని ఆ హక్కును గత ప్రభుత్వం కాలరాస్తుందని, గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వంలోని పెద్ద, పెద్ద నాయకులు గగ్గోలు పెట్టారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఉర్దూభాషపై చిన్నచూపు చూస్తున్నారని ప్రముఖ సంఘ సేవకులు, ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. గురువారం సమైక్య కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాష లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆ నాటి నాయకులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అండగా నిలుస్తామని ప్రగల్భాలు పలికారని తెలిపారు. చాలామంది తల్లిదండ్రులు, విద్యావేత్తలు, మేధావులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టారని చెప్పారు. ఫలితంగా గత ప్రభుత్వవ ఉర్దూ మధ్యమ పాఠశాలల జోలికి రాలేదని పేర్కొన్నారు. అవి ఉర్దూ మాధ్యమంలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దానికి విరుద్ధంగా ఎందుకు వెళుతుందని ప్రశ్నించారు. జిల్లాల ఉప విద్యాశాఖాధికారులు ఉర్దూ మాధ్యమ పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఉర్దూ భాషను తక్కువ చేసి చూపుతూ, ఉర్దూ భాషలో చదువుకుంటే ఉద్యోగాలు రావని, ఉన్నత విద్యను చదవలేరని వారిలో ఉర్దూ భాష పట్ల నెగటివ్ భావాలను పెంపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు మౌఖిక ఆదేశాలిస్తూ తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి అందులో ఉర్దూ మాధ్యమం అవసరం లేదని, ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్చాలని రెజిల్యూషన్స్ పాస్ చేయించి పంపించాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. దీనిని ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలని చెప్పారు. ఉర్దూ మాధ్యమం పాఠశాలలను, అదేవిధంగా మైనర్ విభాగపు పాఠశాలను యధా విధంగా కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం నడిపించ వలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముస్లిం సమైక్యవేదిక రాయలసీమ ఇన్‌ఛార్జి అలీషేర్, గోల్డ్ మస్తాన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సలావుద్దీన్

బలిజలను అవమాన పరుస్తున్నారు

- బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్ : బలిజ సామాజిక వర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్‌కు డైరెక్టర్ పదవి ఇచ్చి బలిజలను అవమాన పరుస్తున్నారని బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు విమర్శించారు. గురువారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో బలిజలు 27 శాతం ఉన్నారని తెలిపారు. టిడిపి ఆవిర్భావం నుంచి బలిజలు పార్టీకి అండగా ఉన్నారని చెప్పారు. గతంలో బలిజలకు సముచిత స్థానం కల్పించారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో బలిజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కషి చేశారని తెలిపారు. బాలిశెట్టి హరిప్రసాద్ పార్టీ కోసం అహర్నిశలు కషి చేశారని చెప్పారు. 2004లో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వంపై పోరాడారని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో బలిజలకు అన్యాయం చేశారని తెలిపారు. పదవి ఇచ్చినా, ఇవ్వకపోయినా పార్టీ కోసం కష్టపడి పనిచేశారని చెప్పారు. బలిజలకు ఎందుకు గుర్తింపు ఇవ్వడం లేదో టిడిపి అదిష్ఠానికే తెలియాలని పేర్కొన్నారు. టిడిపి మేలుకుని బలిజలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ బలిజ సంఘం నాయకులు చెన్నం శెట్టి మురళి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్క రోజు ముందు అడా ఛైర్మన్ పదవిని హరిప్రసాద్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. కేవలం పదవి ఒక్కరోజు ముచ్చట అయిందని తెలి పారు. సిఎం చంద్రబాబు బలిజలను గుర్తించాలని పేర్కొ న్నారు. గతంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బలిజ భవన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మరిచారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక బలిజలను చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు.

హెడ్ బాయ్,హెడ్ గర్ల్‌ను అభినందిస్తున్న శివ శంకర్ రెడ్డి, శ్రీదేవి

ఉపాధ్యాయులను గౌరవించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థులు, ఉపాధ్యాయులను గౌరవించాలని నాగార్జున విద్యా సంస్థల ఛైర్మన్ ఎం. శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. నాగార్జున మోడల్ స్కూల్ రామరాజు పల్లె బ్రాంచ్ లో గురువారం ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవాడతాయని తెలిపారు. తోటి విద్యార్థులతో కలిసి, మెలిసి, సహాయ సహకారాలతో ముందుకు వెళతారని చెప్పారు. ఉపాధ్యాయులు, పెద్దలపట్ల గౌరవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అరుణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గౌస్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

గౌస్ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ కోరారు. గురువారం కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధులలో మురుగు కాలువలను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. రేషన్ కార్డులు రద్దు కావడంతో చాలామందికి పింఛన్లు రావడంలేదని చెప్పారు. వీటిపై స్పందించిన కమిషనర్ సచివాలయ సిబ్బందిని కలవాలని సూచించారు. కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌ఛార్జి షామీర్ హుస్సేన్, నాయకులు యూసుఫ్, నీలం, జాబిర్ అలీ, ముబారక్ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్ : సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని, అనా రోగ్యానికి గురై సొంత డబ్బు ఖర్చు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సిఎం సహాయనిధి మంజూరు చేయడం ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేకతని ప్రభుత్వవిప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. గురు వారం కడప నియోజకవర్గ పరిధిలోని 78మందికి రూ.80లక్షలు విలువ చేసే చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి 5 సంవత్సరాల పాల నలో కడప నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ సిఎం సహాయనిధి అందలేన్నారు. ఇప్పటి వరకు నగరంలో దాదాపు రూ.3 కోట్లకు పైగా తాము సహాయనిధిని అందించామన్నారు. పని చేసే వారికి పట్టం కడితే మంచి ఫలితాలు ఉంటాయని, కులాలు, మతాలు చూసి ఓట్లు వేయవద్దని ఆమె సూచించారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని, జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకులను నింపడంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రధానమంత్రి కుసుం, చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపుదల, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రధాన మంత్రి కుసుం కార్యక్రమంలో సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ మరియు ప్రైవేటు భూములకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పనులకు ఉపయోగకరంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కృత్రిమ మేధస్సు – జెన్ చాట్ బాట్ ప్రాజెక్టుకు సహకరించేలా చర్యలు చేపట్టాలని సిపిఒను ఆదేశించారు. ప్రజల నుండి ఆసుపత్రులలో అందిస్తున్న సేవలపై సేకరించే అభిప్రాయాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ సమీక్షిస్తూ వీటిని ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ, ప్రయివేటు భూములకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'పది' పరీక్షల నిర్వహణ బకాయిలు చెల్లించండి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రభుత్వ పరీక్షల సంచాలకులు శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లాలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించి తిరిగి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కె.వి.శ్రీనివాసులురెడ్డిని యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబీర్ కోరారు. గురువారం వారు కె.వి శ్రీనివాసులురెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో రూ.17.72 లక్షలు, 2023–24 విద్యా సంవత్సరంలో రూ.6.80 లక్షలు చెల్లించాల్సిన బకా యిలను, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షలు నిర్వహించి స్పాట్ వాల్యుయేషన్ పూర్తయి 4 నెలలు గడిచినప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై రెండేళ్లుగా డిఇఒ, కలెక్టర్, ఆర్ జెడిలకు విన్న వించామని, వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేసినా ప్రయోజనం లేదన్నారు. తీవ్రమైన ఎండల్లో సుదూర ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు జిల్లా కేంద్రానికి వచ్చి అరకొర వసతుల మధ్య తమ బాధ్యతలను నిర్వహించారని చెప్పారు. నిబంధనల మేరకు టిఎ, డిఎ, రెమ్యూనరేషన్ ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ అధికారులు చెల్లించక పోవడం దారుణమంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కె.వై.శ్రీనివాసులురెడ్డి స్పందిస్తూ సదరు బకాయిలకు సంబంధించిన టోకెన్ నంబర్లను సమర్పించినచో బకాయిలు విడుదల చేస్తామని అన్నమయ్య జిల్లా డిఇఒను అనేక సార్లు ఆదేశించినప్పటికీ, ఆయా టోకెన్ నంబర్లను ఇవ్వకపోవడం వల్లనే చెల్లింపుల్లో ఆలస్యం అవుతుందని చెప్పారు. ఇప్పటికైనా వెంటనే టోకెన్ నంబర్లను సమర్పించమని డిఇఒ ఆయన ఫోన్లో ఆదేశించారని వారు తెలిపారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు బకాయిలు చెల్లించుటకు, నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . లేని ఎడల ఇతర ఉపా ధ్యాయ సంఘాలను కలుపుకొని డిఇఒ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తామన్నారు.